# నాకీ అనుభూతి చాలు

"అమ్మా! నా ఉద్యోగం కాదు ముఖ్యం...... ఈ జన్మకు కారకులైన వారిలో ఒకరిని.... సజీవుల్ని, 25 సంవత్సరాల కాలంలో చూడలేదనే ఈ అసంతృప్తిని భరించలేను..... గడచిన కాలం మాట వేరు. కాని వారిప్పుడు ఎక్కడో ఉన్నారో తెలిశాక వారిని చూడకుండా ఉండట మెలాగ.....?" అన్నాడు భాస్కరం.

రాజ్యలక్ష్మి ఏ సమాధానం చెప్పలగల స్థితిలో లేదు. ఆమె మనసు పరి పరి విధాల వేగిపోతోంది. ఎలాగో కూడగట్టుకొని....

"ఇప్పుడీ ప్రయాణం చేయకుంటే ఏం నాయినా" అంది.

"కాదమ్మా... నన్నాపకు, నన్నీ అనుభూతి నుండి దూరం చేయకు"-

"నాయినా భాస్కరం-" అంది దీనంగా రాజ్యలక్ష్మి.

"అమ్మా, ఒక్కటాలోచించు. ప్రతి వారికి భగవంతుడు ప్రసాదించిన ఆత్మ బంధువులు తల్లిదండ్రులు. అలాంటి తండ్రి ఆదరాభిమానాలను పొందే భాగ్యం... కనీసం వారిని చూడాలనే నా ఆకాంక్షను కాదనటానికి.... ఎవరికి హక్కుంది?"

ఈ ప్రశ్నతో రాజ్యలక్ష్మి నిరుత్తరు రాలయింది. ఆమె హృదయంలో ఏదో ఉత్కంఠ లాంటి భయం. ఇది ఎలా పరిణమిస్తుందోనన్న అనుమానం.

భాస్కరం సూట్‌కేస్ సర్దుకొంటున్నాడు. మరేం చెప్పినా వినేలా కన్పించటం లేదు. అతని పట్టుదల చూచి రాజ్యం చాల నిస్సహాయ స్థితిలో ఉన్నానేమో

అనుకొంది. తాను నీరు పోసి పెంచిన మొక్క వృక్షమయింది. తనకంటే ఎత్తైంది. భాస్కరంలో వ్యక్తిత్వాన్ని ప్రతిష్ఠించింది తాను. ఆ వ్యక్తిత్వం రాణించాలని, అతడో స్వతంత్రుడూ, మహోన్నతుడూ కావాలని, అతని ఉత్తుంగ కీర్తి కెరటాలను చూడాలని ఆకాంక్షించిందిన్నాళ్లూ.... ఏ వ్యక్తిత్వాన్నైతే భాస్కరంలో ప్రతిష్ఠించిందో ఆ వ్యక్తి భాస్కరం తనను ప్రశ్నిస్తున్నా డిప్పుడు.....?

అవును... భాస్కరాన్ని అతని తండ్రి దగ్గరకు పోవద్దని ఆపటానికి తనకున్న హక్కేమిటి...? రాజ్యం చుట్టూ చలి గాలి లాంటి భయం - భయం లాంటి ఆలోచనలు ఆవరించాయి. లేచి మేడ మీద గదిలో దీపం ఆర్పేసుకొని చీకటిలో ఆలోచనల మధ్య ఆగిపోయింది.

ఆమె కనుల ముందు భర్త 'రామేశం' నిలచాడు. ఏనాటి రామేశం? ఏనాటి స్మృతి....? 26 సంవత్సరాలనాటి తుపాను లాంటి జీవిత సంఘర్షణ మధ్య రామేశం....

తన కళాశాల చదువు రామేశంతో వివాహం స్థిరపడటంతో ఆగిపోవలసి వచ్చింది. తన దృష్టి వివాహం పట్లకన్నా చదువు మీదే లగ్నమయిందనే విషయం నాన్నగారితో చెప్పలేకపోయిందానాడు. నాన్న నిర్ణయానికి మౌనంగా తల వొగ్గింది.

వరుడు ఇంజనీరింగు పూర్తి చేశాడు.. తమ స్థితికి సరితూగిన వారు కాకపోయినా... దూరపు బంధుత్వాన్ని, వరుని తెలివి తేటలను దృష్టిలో పెట్టుకొని వివాహం స్థిరపరచారు నాన్న.

వివాహం జరిగి పోయింది.

వివాహం, పెండ్లి పందిరి, భజంత్రీల సన్నాయి మేళాలు, పేరంటాళ్ల ముద్దు ముచ్చటలు... మూడునిద్రలు, పదహారు రోజుల పండుగ, జీవిత మధువుని చవిచూచిన మరో దివ్య క్షణం... అన్నీ క్షణంలో కరగి పోయినట్లు కరిగి పోయాయి. ఆ భయంకర క్షణం జీవితంలో కాలిడిననాడు అన్నీ నీటి బుడగల్లా పేలిపోయాయి.

వివాహ జీవితంలో నెల తిరగక ముందే తన జీవిత గమనంలో చీకటి మలుపు-! ఏదో దూరప్రాంతంలో కట్టబడుతూన్న ప్రాజెక్టులో పనిచేయడానికి వెళతానన్నాడు రామేశం.

'రాజ్యాన్ని నీ కిచ్చి చేసింది... దాన్ని నా నుండి దూరం చేసికొనటానికి కాదు... కావలసిన డబ్బు ఇస్తాను. ఇక్కడే ప్రయివేట్ ఫరం పెట్టుకొని ఉండిపో-' అన్నారు నాన్న.

యువక రక్తం ప్రగతి పథంకేసి, స్వతంత్ర జీవనం కేసి దారి తీసింది. ఆ భిన్న దృక్పథాలకు పొందు కుదర లేదు. అభిజాత్యం అడ్డుగోడలా నిలచింది మామా అల్లుళ్ల మధ్య. చిలికి చిలికి గాలివాన అయ్యింది.

సరిగ్గా వారం రోజుల తరువాత ఒకనాటి రాత్రిః రాజ్యానికి ఆనాటి సంఘటన బాగా జ్ఞాపకం! మేడ మీద వున్న నాన్నగారి గదిలో పాలు పెడదామని వెళ్లింది తాను. కిటికీ ఇవతలకే విన్పిస్తున్నది నాన్నగారి సంభాషణ - అన్నయ్యతో.

"మధూ! రాజ్యం నా దగ్గర లేని క్షణాన్ని నేను భరించలేను. మీ అమ్మ పోయేనాటి కది చిన్నపిల్ల. కళ్లలో వత్తులు వేసికొని కాపాడి పెంచాను. మళ్లీ వివాహం చేసికొనమని ఎంతో మంది వత్తిడి చేశారు.... కాని దాని కోసం ఈ జీవితాన్ని ఇలా పదిల పరచాను. ఈనాడు దాని నొదలివేసి ఎలా ఉండగలన?'

అన్నయ్య ఏదో అంటున్నారు. తనకు సరిగా విన్పించలేదామాటలు. తన కనుల ముందు యవనిక వెంట యవనిక లేచిపోగా... గతంలో తనను సాకిన తండ్రి కన్పించారు.

తాను అల్లరి చేసి అన్నం తినకుంటే తానూ మానివేసిన నాన్న!

తనకు జ్వరం తగిలితే తల్లడిల్లిన నాన్న? ఇలా... ఇలా...

"కాదని అది వెళ్లిపోతే... చేసేదేముంది. ఈ జీవితంలో ప్రశాంతత తొలగిపోయిందనుకొంటాను. ఈ శేష జీవితం శూన్య మనుకొంటాను. అంతే!" ఏనాడూ వినిపించని దీనత, నాన్నగారి కంఠంలో ధ్వనించింది.

ఏమిటీ పరీక్ష....?

భువి దద్దరిల్లిన ధ్వనితో గుండెల్లో పిడుగు పడ్డట్లు తన గదికి తిరిగి వచ్చింది. గదిలో ప్రయాణానికి సిద్ధమై వచ్చిన భర్త రామేశం....!!!

"నీవు నా వెంట కొన్ని క్షణాలలో బయలుదేరి రావాల్సి ఉంటుంది-" అన్నారాయన. తాను ఎటూ నిర్ణయించుకోలేక పోయింది. తన కనులనిండా

కన్నీరే నిండిపోయి అంతా అంధకారమైనట్లు అన్పించింది.

తన మౌనం పట్ల నిరుత్తరులయ్యారాయన.

మూగపోయిన గొంతుకతో,దీన దృక్కులతో- "స్థిమితంగా ఆలోచించండి. ఇలాంటి స్థితిలో నాన్నను వదలిరావటం" అనగల్గింది తాను.

ఆయన అవమానపడిపోయినట్లు, అక్కడి నుండి వెళ్లిపోయారు... తాను చూస్తూ ఉండిపోయింది. ఆ రాత్రి జీవితంలో కాళరాత్రి. తన జీవితాన్నే హరించి వేసిన చీకటి రాత్రి.

ఆ తరువాత అన్నయ్య బాధ పడ్డారు. 'ఇలా ఎందుకు చేశావమ్మా-' అన్నారు. తాను నిర్దోషి. సరిగా 17 సంవత్సరాల వయసులేని తనను జీవితం అనే చీకటి సందులో భయంకర పరిణామాల ముళ్లకంపలో నడిపించి, ముళ్లెందుకు గుచ్చు కొన్నాయని ప్రశ్నించినట్లు- ఏమిటిది!

అన్నయ్య మేరుపర్వత సమానులు. ఎలాగో వారి అడ్రసు సంపాదించ గలిగారు. 7 నెలల తరువాత- అడ్రసు చిక్కగానే అన్నయ్య తన హృదయాన్ని ఎరిగున్నట్లు ఆయనకు వ్రాశారు.

'రాజ్యం గర్భిణి. మీ కోసం తపించి పోతోంది. ప్రయాణం చేయగల స్థితిలో లేదు. ఒక్కసారి వచ్చి చూచి వెళ్లండి-' అని. 2 వేల మైళ్లదూరంలోవున్న వారి జవాబు కోసం... కళ్లలో వత్తులు వేసి కొని అహోరాత్రాలు ఎదురు చూచింది తాను, కాని... తన ఆశలన్నీ కూలి పోయాయి. జవాబు లేదు.

భాస్కరం పుట్టాడు. పెన్నిధులున్న ఆ యింటిలో తండ్రి అనే పెన్నిధానానికి దూరంగా.

మరో మూడు నెలలకు అన్నయ్య 'మధు'- వారి దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చాడు.

'రాజీ! నీ కాపురం బాగు చేదామని వెళ్లాను. అక్కడ మరో చెల్లాయి కన్పించింది, నీ స్థానాన్ని ఆక్రమించి. రామేశం మళ్లీ వివాహం చేసికొన్నాడు. ఒక చెల్లెలి జీవితాన్ని దిద్దటం కోసం మరో చెల్లెలిని అశాంతికి గురిచేయలేక తిరిగి వచ్చాను. నేను చేయగల్గిందేమీ లేదమ్మా-" అంటూ కన్నీరు కార్చారు.

"ఏమిటి ఆయన చేసిన పని" అన్పించింది. "భర్తగా ఆయన బాధ్యతల మాటలా వుంచి, పుట్టి పెరుగు తోన్న పసిపాపకు తండ్రిగా తన బాధ్యత ఏమైనట్లు-?"

ఒక్కటే అనిపించింది... మగవారి అభిజాత్యత్వాలకు, అభిమానాలకు తాను యజ్ఞ పశువయింది. జీవితంలో వారి శాసనాలకు తాను తల వొగ్గి శిక్షింపబడింది. ఆనాడే కాదు-ఈనాడూ అంతే...

తన కోసం ఈ మోడువారిన జీవితాన్ని కొసాగించిన తనను భాస్కరం ఎదిరించి ప్రశ్నిస్తున్నాడు!

తాను అశక్త అవుతోంది! ఈ 25 సంవత్సరాలలో ఎన్ని పరిణామాలు, తన్ను శక్తురాలినిచేసి, తన ముందు కరిగి పోయాయి!

విధి వంచనకు తలవొగ్గి 'అమృత మూర్తి' అన్నయ్య బరువైన తన స్మృతులను మిగిల్చి నూరేండ్ల తన జీవితాన్ని తెల్లవార్చుకొని వెళ్లిపోయారు. ఆ గృహంలో అన్నయ్య అనే నిర్మలజ్యోతి ఆరిపోగా నాన్న చితికి ఛిద్రమైన జీవిత శిథిలాలయంలో మౌనంగా, పిచ్చిగా మిగిలి పోయారు.

నాన్న అలా అయ్యాక, అన్నయ్య లేకపోయాక- వదిన ఉత్తరాధికారిణి అయిన ఆ యింటిలో తన స్థానాన్ని గుర్తించి, భాస్కరంతో ఆ గృహం నుండి బయటకు వచ్చివేసింది తాను. మేనల్లుడు చిన్నవాడు అయినా 'వద్దత్తా-ఉండిపో' అన్నాడు.

చిరునవ్వు నవ్వి- 'వస్తానయ్యా-' అని చెప్పి వచ్చేసింది తాను. మంచంలో చిక్కి శల్యమై ఎక్కడో ఉన్నట్లున్న నాన్నగారితో 'వస్తాను నాన్నా!' అని చెప్పటానికి వెళ్లిననాడు ఆయన మౌనంగా ఎటో చూస్తూ ఉండిపోయారు. బహుశా జీవితంలో తాను చేసిన తప్పొప్పుల పట్టికలోని లాభ నష్టాల బేరీజు వేసికొంటున్నారేమో.

ఏనాడో చదివిన హిందీ, జీవనభృతికి ఆసరా అయింది. భాస్కరం దిన దిన ప్రవర్ధమానమైన తెలివి తేటలతో తన జీవితాశను పెంచాడు. స్కాలర్ షిప్స్‌తో 'ఇంజనీరింగు' పూర్తి చేసి తిరిగి వచ్చాడు యూనివర్శిటీ నుండి.

ఏవో ఉద్యోగాలు పడ్డాయి. అప్లై చేశాడు. ఆ ప్రయివేట్ సంస్థ అధినేత

ఎవరో వాకబు చేసి వచ్చి తన జీవితంలో ఏనాడో అణగి పోయిన తుపాను మళ్లీ రేపాడు.

26 సంవత్సరాల క్రిందట నా జీవితాన్ని నుండి తొలగి పోయిన తన తండ్రేనట - ఆ విషయం చెపుతూ పరవశించి పోయాడు భాస్కరం, 'అమ్మా వారిని చూచి 'వస్తానమ్మా' అంటూ. తాను వణకిపోయింది. భాస్కరం తనకు దూరం అయిపోతాడేమో అనే నల్లటి మబ్బు లాంటి భయం... రామేశానికి భాస్కరంపట్ల ఎందుకుంటుంది ఆపేక్ష? పెంచిన మమతా, స్నేహమా... ఏదీ లేదు. పైగా అతడి తల్లిపై ద్వేషం. ఆ తల్లి నీడలో ఎదిగిన నిసువీతడు!! రామేశం ఒంటరి కాదు, రక్త బాంధవ్యం బంధిస్తుందనటానికి. అతనికీ భార్యా, పిల్లలూ ఉన్నారు... తానొక బాధతో కూడిన స్మృతి. పైగా రామేశం ఇప్పుడో సంపన్నుడు. ఒక వ్యాపార సంస్థకు అధినేత. జీవితంలో ఏ అంతస్తు తన నుండి ఆయనను దూరం చేసిందో... అలాంటి అంతస్తును అధిగమించి ఉన్నాడీ నాడు-... ప్రతీకారచర్య తీసికొన్నా తీసికొనవచ్చు.

"అమ్మా" అనే పిలుపుతో ఉలిక్కిపడి మేల్కొంది రాజ్యం ఆలోచనల నుండి. ఎదురుగా ప్రయాణానికి సిద్ధమైన భాస్కరం.

"బాబూ...వద్దు...నీవు అవమానింపబడతావు-" రాజ్యం నోటివెంట వేదనలా విన్పించాయి మాటలు.

"నా కవమానమేమిటమ్మా...జీవితంలో అన్ని అనుభూతులకు దూరమై, అసమగ్ర జీవితాన్ని గడిపేకన్నా, ఆ అనుభూతి పొంది వస్తాను-"

"భాస్కరం! అయితే నీ నిర్ణయమే అంతిమమా?"- ప్రశ్నించింది రాజ్యం.

"అమ్మా ఒక్కటి ఆలోచించు. ఒకనాడు నాన్నగారితో వెళ్లటమా లేదా, అనే సమస్యలో నీ నిర్ణయం నీవు తీసికొన్నావు. నే నిప్పుడు నీ ఆనాటి నిర్ణయపు తప్పొప్పులను చర్చించటం లేదు. అలాంటి హక్కే నేను అడుగుతున్నాను. నాన్న గారి దగ్గరకు వెళ్లటమా - మానటమా అనేది నేను తీసికొనవలసిన నిర్ణయం!" అన్నాడు భాస్కరం.

రాజ్యం మారు మాటాడలేక పోయింది.

భాస్కరం సూట్ కేస్ తీసికొని రైలు స్టేషన్‌కు ప్రయాణమై వెళ్లిపోయాడు. ఏదో ఆశతో, ఉత్సుకతతో సాగిపోతున్న భాస్కరంకేసి మేడపై నుండి చాలసేపటి వరకు... అతనా దూరపు వీధి మలుపు దాటేవరకు చూస్తూ ఉండిపోయింది.

ఒకనాడిలాగే రామేశం తన నుండి వెళ్లిపోయాడు- ఈ భావనతో రాజ్యం వణకి పోయింది.

భాస్కరం మలుపు తిరిగి వెళ్లిపోయాక.... వర్షపు జల్లు ప్రారంభమయింది. ఉరుములు మెరుపులతో పెనుగాలి వీచింధి.కుంభవృష్టి కురిసింది. ఆ తెల్లవార్లూ ఆ వర్షం అలా కురుస్తూనే ఉంది - మబ్బంతా జలమైనట్లు నేలంతా నీటిలో మునిగి పోతున్నట్లు - నేల, ఆకాశం ఏకమైపోతున్నట్లు.

★ ★ ★

సాయంత్రం 4 గంటలకల్లా మైసూర్ హోటల్ నుండి బయలుదేరాడు భాస్కరం, తాను సంపాదించిన రామేశంగారి ఇంటి అడ్రసుకు. టాక్సీ డ్రైవరు అరగంటలో తీసికొని వెళ్లి దివ్య భవనంలాంటి ఆ యింటి ముందు ఆపాడు కారును. భాస్కరం కనులు క్షణ కాలం మిరుమిట్లు గొలిపాయి. మూడంతస్తుల భవనం. ఇంటిముందు పెద్ద లాను. ఒక ప్రక్క పానుగుతో నిర్మింపబడిన అవుట్ హౌస్... దానిపై ద్రాక్ష తీగలు - మరో ప్రక్క గార్డెన్.

ఆ యింటి పేరు - "ఆనంద నిలయం"

రామేశం కోసం వచ్చిన విజిటర్సు కార్లు లానులో పార్కు చేసి ఉన్నాయి. తానూ వెళ్లి విజిటర్సు గదిలో కూర్చొన్నాడు. అప్పటికే అయిదారుగురు ఉన్నారా గదిలో. దాని ప్రక్కన వున్న 'ఎయిర్ కండిషన్డు' గదే రామేశంగారి ఇంటిలోని ఆఫీసు గది.

జవాను రావటం, ఒక్కొక్కరినే లోపలకు తీసికొనిపోతూ... మరొకరి విజిటింగ్ కార్డు పట్టుకొని పోవటం, అంతా నిశ్శబ్దంగా... ఒక పద్ధతిలో జరిగి పోతోంది. భాస్కరం తన వంతు రావాలంటే మరో గంట పట్టవచ్చు అనుకొన్నాడు. అతని కళ్లు ఎదురుగా నిలువెత్తున్న గ్లాస్ డోర్సు మీదకు, రంగు కర్టెన్సు మీదకు మళ్లాయి. ఎంతో అందంగా, ఏ కిటికీకి ఏ రంగు మాచ్ అవుతుందో ఏర్చి

కూర్చినట్లు అలంకరింపబడి ఉన్నాయి.

లక్ష్మీ నిలయమాఇల్లు అనిపించింది. లక్ష్మీపుత్రులు వీళ్లు.... భాస్కరానికి తటిల్లత లాంటి ఆలోచన మెరసింది. ఆ భవనంలో, ఈ ఐశ్వర్యంలో తనకూ న్యాయమైన వాటా ఉంది కదూ...! మరులిప్తలో ఒక చిరునవ్వు అతని పెదవుల మీద వెలిగి మాసిపోయింది. తన స్థాన మేమిటో తెలియని ఆ ఇంటిలో తనకు వాటా ఏమిటి...?

ఎడమ ప్రక్కగా వున్న గ్లాస్ డోర్సు నుండి కన్పిస్తున్న దృశ్యం అతని కంట బడింది. గార్డెన్‌లో మామిడి చెట్టు క్రింద, 20 సంవత్సరాల యువకుడు, 18 సంవత్సరాలు చెల్లాయి, మరో ఇద్దరు తమ్ముళ్లు, వాళ్ల తల్లిగారు, నీరెండలో కుర్చీలపై ఆసీనులై కాఫీ తీసికొంటున్నారు, కబుర్లు చెప్పుకుంటూ. వాళ్లంతా రామేశంగారి పిల్లలై ఉంటారు... అంటే తనకు తమ్ముళ్లు - చెల్లాయిలు! ఈ భావంతో భాస్కరం హృదయం ఉప్పొంగి పోయింది. ఏదో అనిర్వచనీయమైన భావం ఒడిసిపట్టినట్లు... లోకంలో తాను ఒంటరిని కాదన్నట్లు... గబ గబా లేని వెళ్లి ఆ గ్లాస్ డోర్సు నానుకొని వారిని చూస్తూ ఉండిపోయాడు.

కాఫీలు అయిపోయాక పెద్ద కుర్రాడు స్కూటర్ మీద ఎటో వెళ్లిపోయాడు. మాలి తెచ్చిన గులాబీలను,మల్లెలను తీసికొని చెల్లాయి లోపలికి వెళ్లిపోయింది. పిల్లలంతా ఆటలలో నిమగ్నులయ్యారు.

ఆ యింటి పేరు జ్ఞాపకానికొచ్చింది భాస్కరానికి, "ఆనంద నిలయం".

"గ్లాస్ డోర్‌మీద అలా పడిపోతే, మాసి పోతాయి. కొంచం దూరంగా నిలబడండి"- అన్నాడు, ఎవరో నౌకరు.

గతుక్కుమన్నాడు భాస్కరం. అవును. వాళ్ళను చూస్తూ ఎలా ప్రవర్తించాలో తాను మరచి పోయాడు.ఏదో తప్పు చేసిన వాడిలా ఇవతలకు వస్తోన్న భాస్కరాన్ని క్రిందికీ పైకీ అదోలా చూచి వెళ్లిపోయాడు నౌకరు. భాస్కరం వెనుకకు తిరిగి వచ్చి విజిటర్సు రూమ్‌లో కూర్చొన్నాడు.

తనకక్కడ న్యాయమైన స్థానం ఉంటే తననలా గ్లాస్ డోర్‌ను తాకవద్దని చెప్పగల ధైర్యం ఆ నౌకరుకుండేదేనా...? వెంటనే లేచి ఆ గ్లాస్ డోరును

ముక్కలు ముక్కలుగా బద్దలు కొట్టేసి తన స్థానాన్ని సాధించుకొందామనే భాస్కరం ఆవేశం, ఏమిటీ అవివేకం అనే భావంతో కరగి పోయింది.

జవానువచ్చి తనను పిలిచాడు లోపలికి.

వణకి పోయాడు తను. క్షణ కాలం ఆలోచనలు ఆగిపోయాయి. ఎక్కడకు తాను వెళ్లటం...? తనెవరో ఎరుగని తండ్రి దగ్గరకు.. తాను ఫలానా అని చెప్పుకొనవలసిన దుస్థితిలో. ఆయన అంగీకరించక నిరసిస్తే, తన పరిస్థితి దౌర్భాగ్యమౌతుంది.

"నాయినా, వద్దు. నీవు అవమానింపబడతావు" అన్న అమ్మ మాటలు చెవులలో గింగురుమన్నాయి. ఒక్క క్షణం వెనక్కి తిరిగి వెళదామనిపించింది. కాని రక్తంలోని ఏదో తన వశం కాని శక్తి తనను నిరోధిస్తోంది. భాస్కరానికి పూర్తిగా ఆలోచనలు సద్దు మణగి తెలివి వచ్చేవరకు రామేశం గదిలో ఆయన ముందు నిలుపబడి ఉన్నాడు.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్" అన్న మాటలు విన్పించాయి. మంత్రముగ్ధుడిలా కూర్చొండి పోయాడు.

దబ్బపండు లాంటి ఛాయ.... ఆరడుగుల సుందర విగ్రహం, కొట్టవస్తున్న ట్లున్న దర్పం, ఎదుటి మనిషిని తూచి విలవ కట్టగలిగిన కళ్లు, అనుభవాన్ని చాటుతూ తలపై అక్కడక్కడ కొన్ని ఫలిత కేశాలు... మంచి తనాన్ని చూపే ఆ కళ్లు, ఆ నిండైన విగ్రహాన్ని చూస్తూ నిశ్చేష్టితుడైనట్లు, మ్రాన్పడినట్లు ఉండిపోయాడు.

రామేశం క్షణ కాలం భాస్కరాన్ని నిరుత్తురులై చూచారు.

ఆ క్షణంలో రక్తం తనను తాను గుర్తెరిగినట్లు మూగ భాషలో నిట్టూర్చింది. ఆ నిట్టూర్పు ఏ బాహ్య చక్షువులకు విన్పింపక అంతర్హితమైంది.

"యస్-" అన్నారు సాలోచనగా రామేశం ఈ మాటలు విన్పించనట్లు వెర్రిగా చూస్తూనే ఉండిపోయాడు. భాస్కరం.

రామేశం ఆశ్చర్యపోయాడు. మరో ప్రయత్నంగా "మీకు నేనేం సాయం చేయగలను?" అని ప్రశ్నించారు.

భాస్కరం రామేశంగారి మీది దృష్టి నలాగే ఉంచి- "అదే ఆలోచిస్తున్నాను-' అన్నాడు.

ఈసారి రామేశం చకితుడయ్యాడు. 'ఏమిటీ కుర్రాడు...?' అనుకొన్నాడు. తన దగ్గరకు వచ్చేవారందరు తన దయా, ధర్మభిక్ష కోసం వచ్చేవారు. తన నేదో అర్ధించేవారు మాత్రమే. తాను పెదవి కదల్చక ముందే వంది మాగధుల్లా తన ఐశ్వర్య ప్రతిభలను పొగడి తమ తమ అభ్యర్ధనలను సవినయంగా విన్నవించు కొంటారు. కాని ఇతడేమిటి....? తన ఉనికినే ప్రశ్నిస్తున్నట్లా చూపు...ఏదో శోధన జరుపుతున్నవాడిలా ఆ వాలకం....?

"పోనీ ఆలోచించి మరోసారి కలవండి" అంటూ రామేశం ఏవో కాగితాలు చూచుకోనటానికి ఉద్యుక్తుడయ్యాడు.

భాస్కరం త్రుళ్లిపడినట్లు- "క్షమించండి మరేం లేదు. రేపు జరగపోయే ఇంటర్వ్యూకి నేనొక అభ్యర్థిని" అన్నాడు.

రామేశం క్షణంలో మారిపోయాడు. అతనిలో ఒక విధమైన గంభీరత మూర్తీభవించింది. ఏదో అంతస్థు పైనుండి మాట్లాడుతున్నట్లు- "మిస్టర్ భాస్కర్! మీరు రేపు రావలసింది-" అన్నాడు.

"అవును-"

"కాని ఈనాడు వచ్చారు. అవునా? అందుకని ఈనాడే చెపుతున్నాను. మాకు కావలసింది నీతి, నిజాయితీలతో, కష్టించి పనిచేసేవారు. తమ ప్రతిభా విశేషాలతో మమ్మల్ని మెప్పించి మా సంస్థలో స్థానాన్ని పొందేవారు... కాని ఇలా ముందే వచ్చి ఆశ్రయించి ఉద్యోగాలు సంపాదించేవారు కాదు. ఇలాంటి వారు తమ ఉద్యోగ ధర్మాన్నెలా నిర్వర్తిస్తారో, ఎంతగా పనికొస్తారో మాకు బాగా తెలుసు, నీలాంటి వాళ్లకు మా సంస్థలో ఖాళీలు లేవు. రేపు మీరు రావలసిన పని లేదు. ఇలా చెప్పవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను."

సావధానంగా విన్న భాస్కరం తన నావరించిన జడత్వాన్ని జార్చినట్లు గాలి పీల్చి, "ఈ ఉద్యోగాన్ని గురించి నేనుగా ఏమీ చెప్పుకోవటానికి రాలేదు-"

"మరి రికమండేషన్ పట్టుకొచ్చారా?" అన్నాడు రామేశం చిట్లించిన మోముతో.

"అవును"

"భాస్కరం! ఇక్కడ ఎవరి సిఫార్సులూ పనిచేయవు."

"పనిచేసేవారి సిపార్సునే పట్టుకొని వచ్చాను-"

రామేశం కోపంతో పూగిపోయినట్లుయి తమాయించుకొని- "ఎవరి సిఫార్సు?"- అన్నారు.

"నాదే"

"ఎవరు నీవు...?"

"అదే ఆలోచిస్తున్నాను... ఎలా చెప్పటమా" అని.

రామేశం గొల్లున నవ్వాడు. బుగ్గ మీద సొట్ట పడింది. భాస్కరానికి గుప్పున జ్ఞాపకానికొచ్చింది. అద్దంలోని తన మోములో తాను చిరునవ్వు నవ్వుకొన్నప్పుడు పడే లాంటిదే... నవ్వాపి- "ఎక్కడ నుండి వస్తున్నావు? కొంపదీసి విశాఖపట్నం నుండి కాదు కదా!" అన్నాడు రామేశం.

"కాదు... గుంటూరు నుండి. నే నెవరినో వినండి, నేను... నేను రాజ్యలక్ష్మి కొడుకుని-"

"రాజ్యలక్ష్మి...! ఎవరు... ఎవరా రాజ్యలక్ష్మి?"

భాస్కరం లేచి నిలువబడి, టేబిలు మీదకు దృష్టి సారించి - "అవును మరచిపోయి ఉంటారు. రాజ్యలక్ష్మి అంటే రాజ్యం... మీరు 26 సంవత్సరాల వెనుకకు పోగల్గితే మీ స్మృతిలో మెదుల్తుంది. అభిమానాలు, అభిజాత్యత్వాలకు మీ నుండి వేరయిన ఆనాటి మీ రాజ్యం. మీరు పునర్వివాహితులయ్యారు. ఆమె మాతృమూర్తిగా మిగిలి పోయింది. మీరు ఆమెను మరచిపోగల్గారు. ఆమె మరచిపోవటానికి ప్రయత్నించింది. మిమ్మల్ని కాదు, జీవితంలో సుఖ శాంతు లుంటాయనే విషయాన్ని. మీరు మీ వ్యవస్థను ఏర్పరుచుకొని అనుభవించారు. కఠిన జీవితాన్ని ఆమె అనుభవించింది. తనకు మిగిలిన పసికందును బ్రతికించు కొనటంలోని కష్టాన్ని అనుభవించింది...... క్షమించండి! మీ జీవితాలలో మీరు చేసికొన్న నిర్ణయాలపట్ల, మీరు అనుసరించిన విధానాలపట్ల నా తీర్పు నివ్వటం కాదిది. అలాంటి ప్రయత్నం చేయటానికి నేను సాహసించను-" భాస్కరం ఆగిపోయాడు.

రామేశం స్తంభించిపోయినట్లు నిశ్చేష్టుడయ్యాడు. అతని మెదడులో ఏదో తుపాను లాంటి సంఘర్షణ. బయట గది గాజు తలుపులకు లారీలు గ్రుద్దుకొన్నట్లు, అవి తునాతునకలై పోతున్నట్లు... ఆ గాజు ముక్కల నిండా రాజ్యం ప్రతిబింబాలు తన కేసి చూస్తున్నట్లు...

నిశ్శబ్దాన్ని నిరసిస్తూ... సన్నని ఎ.సి చప్పుడు భాస్కరం నొక్కుల జుట్టులోని కొంత భాగం నుదుటిపైకి జారింది - రామేశానికి మెరుపు తరగల్లా అద్దంలో చూచుకొన్నప్పటి తన జుత్తు జ్ఞాపకాని కొస్తోంది.

రామేశం కుర్చీ మీద నుండి లేచి తన గది తలుపులు మూసి గడియవేసి భాస్కరానికి వెనగ్గా వచ్చారు.

"భాస్కరం! రాజ్యం నిన్నెందుకు నా దగ్గరకు పంపించిందో అర్థం అవుతోంది. కాని ఇంతకన్న వివేకమైన పద్ధతిలో ఆమె ఆనాడు యోచించగలిగినట్లైతే... ఇంత కాలం అలాంటి వ్యర్థ జీవితాన్ని ఆమె గడపవలసి వచ్చేది కాదు.... నిరపరాధివైన నీవీనాడిలా నా దగ్గరకు ఇలా రావలసివచ్చేదీ కాదు...

కొరడాతో చరచినట్లు వెనక్కి తిరిగాడు భాస్కరం. నిలువెల్లా రామేశాన్ని ఒక్కసారి చూచి - "రాజ్యం పంపితే నేనిక్కడకు రాలేదు... పైగా ఆమె వద్దంది. కూడ...కానీ నేనే వచ్చాను" అన్నాడు.

"నీవే వచ్చావా-?"

"అవును నేనే వచ్చాను. మీ మీదకు దండెత్తి రాలేదు. మీరు కష్టించి, ఆర్జించుకొన్న మీ ఐశ్వర్యాన్ని, సంఘంలోని పేరు ప్రతిష్ఠలను పంచుకోవటానికి కాదు నేనొచ్చింది....."

"మరెందుకొచ్చినట్లు?" అన్నట్లు చూసాడు రామేశం.

"చెప్పనా.....చెప్పనా" భాస్కరం రామేశంలోకి జాలిగా చూచాడు. భాస్కరం కనుల వెంట అప్రయత్నంగా నీరు జాలు వారింది. ఒక్కొక్క కన్నీటి కణం నేల రాలి చిటికి సహస్రాణువులై ప్రవహించటం మొదలెట్టాయి....వాత్సల్యాన్ని అర్థిస్తున్న మహా వాహినిలా......

"మీరు తండ్రి.....నేను కొడుకును. ఈ విషయంలో వాగ్వివాదాలకు....వివాద

పరిష్కారాలకు చోటు లేదు. పరిష్కరించవలసిన సమస్యే లేదిక్కడ. నా చిన్నతనం నుండి ఎంతో మందిని చూచాను....పితృవాత్సల్య పరిధిలో పెరిగినవారిని....తండ్రి ప్రేమలో తల మున్కలుగా ఎదిగిన వారిని - వారంతా అదృష్టవంతులు. దురదృష్టవంతులనూ చూచాను, చిన్ననాడే తండ్రిని కోల్పోయి పితృప్రేమకు దూరమైన వాళ్లను. కాని నా లాంటి దురదృష్టవంతులు ఎక్కడా కన్పించలేదు. నా కొక తండ్రి ఉన్నారు. ఆయన ఉన్నతులు, మహోన్నతులు. కాని నా కాయన లేరు. వారి వాత్సల్యాన్ని చవి చూడటమే కాదు. కనీసం వారి మూర్తిని చూడటానికైనా నోచుకోలేదు.

"దయామయుడైన భగవంతుడు విశాల ప్రపంచంలో ఒంటరిగా ఎగిరిపోయే పక్షికి, నూతిలోని......రాతిలోని కప్పకు రక్షణ కల్పించాడు. అలాగే ఎదిగాను....కాని ఆ అనుభూతి....తండ్రిని చూడాలనే ఆ వాంఛ, వారిని చూచి నా కొక తండ్రి ఉన్నారని.....వారి ముందు నిలువబడి కొన్ని వాక్యాలైనా మాట్లాడాలనే ఆ ప్రగాఢానుభూతి కోసం తపించి పోయాను. మీరిక్కడ ఉన్నారని తెలిశాక, అందుకే వచ్చాను, మనస్సునే వేగంగా చేసుకొని.

"మీకు నేను కాక పిల్లలున్నారు. కొడుకును చూడటం అనే అనుభూతేమిటో మీకు క్రొత్త కాకపోవచ్చు - అసలది గుర్తింపబడకపోవచ్చు, కాని నా విషయం వేరు..... నే నొచ్చిన పని అయిపోయింది. నేను తృప్తి చెందాను......వస్తాను - సెలవు-"

భాస్కరం వెళ్లిపోయాడక్కడనుండి.

★ ★ ★

సాయంత్రం ఆరున్నర గంటలకు హోటలు గదికి తిరిగి వచ్చిన భాస్కరం విసుగ్గా గది తలుపులు మూసికొని బెడ్ మీద వాలిపోయాడు......లైటన్నా వేసికొనకుండా. ఒకటి రెండుసార్లు హోటల్ బాయ్ వచ్చి తలుపు చప్పుడు చేసి, భాస్కరం నుండి సమాధానం లేకపోవటంతో వెళ్లిపోయాడు లాగుంది.

రాత్రి 8 గంటల వరకు అలాగే ఉండి పోయాడు భాస్కరం....సాయంత్రం జరిగిన సంఘటన కనుల ముందు తిరిగి పోవటం ప్రారంభించింది. తన తల్లి

అభీష్టానికి వ్యతిరేకంగా తానీ ప్రయాణం చేసి సాధించిందేమిటి? తానేమీ సాధిద్దామని రాలేదు. తండ్రిని చూద్దామని వచ్చాడు. చూచాడు. తనలో పాతుకొనిపోయిన ఉత్కంఠను తొలగించుకొన్నాడు. తాను రావటాన్ని ఆయన మరో ప్రయోజనానికన్నట్లు అనుమానించారు -- ఆ అనుమానాన్ని తొలగించాడు తాను.

భాస్కరానికి గుప్పున జ్ఞాపకానికొచ్చింది - తాను వచ్చేస్తుండగా రామేశంగారి మోములో మారిన రంగు....కనులలో పొడచూపిన ఏదో భావం, భయం వేసింది.

వెంటనే లైటు వేసి ఏదో వ్రాసి టేబిల్‌పై నుంచి ఏదో బరువు ఉంచాడు. గబ గబా బట్టలు సర్దుకొని రోడ్డు పైకి వచ్చి టాక్సీ పిలిచాడు- నిమిషాలలో స్టేషన్ నుండి బయలుదేరనున్న ఎక్స్‌ప్రెస్ నందు కోవటానికి.

★ ★ ★

అదే సమయంలో "ఆనంద నిలయం" నుండి రామేశంగారి కారు బయలు దేరింది హోటళ్ళన్నీ వెతుకుతూ....మైసూరు హోటల్ కౌంటరు దగ్గరున్న పుస్తకంలో వ్రాయబడిన గది నంబరును చూచుకొని....రామేశంగారు గదిలోకి వచ్చి లైటు వేశారు. భాస్కరం బదులు - జాబు.

"శ్రీ నాన్నగారికి, నమస్కారాలు. మీరు నా కోసం వస్తారని నాకు తెలుసు.... కానీ నేను వెళ్ళిపోతున్నాను. కావాలనే చేస్తున్నానీపని. మన జీవితాలు విచిత్రంగా సాగిపోయాయి ఇన్నాళ్లూ. అలాగే సాగిపోతే బాగుంటుంది. ఇక ముందు కూడా దీనికి భిన్నంగా మనమెలాంటి ప్రయత్నం, ప్రయోగం చేసినా.....ఏమో నాకు భయంగా ఉంది. మీ ఆనందనిలయం......అలాగే కలకాలం ఉండాలని నా ఆకాంక్ష. ఇంత దూరం వచ్చినందుకు మిమ్మల్ని చూచాను. తమ్ముళ్లను, చెల్లాయిని, పూజ్యులు పిన్నిగారిని చూచాను. ఈ అనుభూతి మూగదైనాసరే చాలు నాకు.

అంతేకాదు - ఒకనాడు విధి విధానం వలన మీరు వేరుగా వెళ్ళిపోవలసి వచ్చింది. మీ రాజ్యం రక్షణ క్రింద నన్ను వదలివేసి. ఆ పవిత్రురాలి రక్షణలో నేను కృతార్థత పొందాను. ఇకముందు కూడ ఆమె రక్షణ క్రిందే జీవితయాత్ర

సాగిస్తాను. ఆమె దగ్గరకే తిరిగి వెళుతున్నాను. నా కోసం ఆమె తల్లడిల్లుతూ ఉంటుంది.

మరల మరల జన్మ అంటూ వుంటే ఆ లీలామానుషమూర్తికి, కరుణామయునికి నా ప్రార్థన ఒక్కటే - మరే జన్మలోనూ నా కిలాంటి అన్యాయం చేయవద్దని.

నమస్కరిస్తున్నాను - మీ అంతటివాణ్ణి కమ్మని నన్ను దీవించండి.

నమస్కారాలతో, భాస్కరం.

రామేశంగారి కంటి నుండి రెండు బాష్పకణాలు జారి చేతిలోని కాగితం మీద పడ్డాయి.

జివ్వుమని చలిగాలి వీచింది. ఫెళ ఫెళ మంది ప్రకృతి. మెరపులతో పెనుగాలి వీచింది. కుంభవృష్టి కురిసింది. ఆ తెల్లవార్లూ ఆ వర్షం అలా కురుస్తోనే వుంది, మబ్బంతా జలమైనట్లు, నేలంతా నీటిలో మునిగిపోయినట్లు. నేల, ఆకాశం ఏకమై పోతున్నట్లు. ●

## కథ వెనుక కథ :

మా బంధువులు, మాజీ జమీందారులు, వారి కుటుంబంలో జరిగిన అభిజాత్యత్వాల పోరులో నలిగి పోయిందో 'రాజ్యం' గారు, ఎదిగిన రాజ్యంగారబ్బాయి వాళ్ళమ్మగారిని ఉడికించటానికి వ్యాపారవేత్తగా వున్న వాళ్ళ నాన్నగారి దగ్గరకు వెళతాననేవాడట. వినోదంగా చెప్పుకొనే వారీ ఉదంతాన్ని.

ఆ తండ్రీ తనయులు, తటస్థ పడితే, ఆ అనుభూతు లెలావుంటాయి- అని వ్రాసిన కథ.

★ (ఆంధ్ర సచిత్ర వారపత్రిక : 20-08-1965) ★